సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 4 । ఆగస్టు । 2024



దినసరి.. వారి పని సరి

ఆదిత్యాలయంలో దినసరి ఉద్యోగులపై వేటు పడింది. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తీసేశారు.

- 8లో



ఉక్కుపాదం మోపుతాం

ఇసుక అక్రమ రవాణాపై అధికారులు స్పందించారు. పలుచోట్ల కందకాలు తవ్వించారు.

- 8లో

కంప్యూటర్ అకౌంటెన్సీలో శిక్షణ

ఎచ్చెర్ల: స్థానిక యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా గ్రామీణ ప్రాంత యువకుల కోసం కంప్యూటర్ అకౌంటెన్సీలో 30 రోజుల ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఉచిత వసతి, భోజన సదుపాయాలు ఉంటాయని అన్నారు. వివరాలకు 79933 40407, 95534 10809 ను సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

బొత్సను కలిసిన నాయకులు



బొత్స సత్యనారాయణను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

టెక్కలి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, నాయకులు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, మెంటాడ స్వరూప్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న బొత్స సత్యనారాయణను గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు.

వంశధారలోకి అభిషేక జలం



ప్రధాన ఆలయం వద్ద అభిషేకాల నీటిని తోడిస్తున్న ఈఓ ప్రభాకరరావు, సిబ్బంది

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ప్రధాన ఆలయంలో అభిషేక జలం బయటకు వెళ్లేందుకు తగు చర్యలు తీసుకున్నామని ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. ఈ నెల 30న 'ముఖలింగేశ్వర..అందరికిస్తావు మోక్షం.. నీకేది ప్రాప్తం' అన్న శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్, ఆలయ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు ప్రధాన ఆలయంలో అభిషేకాలు, పూజలు అనంతరం నీరు, పూజా సామగ్రి బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు చండికేశ్వరుడు, వారాహి అమ్మవారి వద్ద నిల్వ ఉన్న అభిషేకాల నీటి దుర్వాసన లేకుండా చర్యలు తీసుకోవాలని ఈఓను ఆదేశించారు. శనివారం ఈఓ ఆలయ సిబ్బంది కలిసి ఈ మేరకు పనులు చేపట్టారు. మరమ్మతుల కోసం కేంద్ర పురావస్తు శాఖకు నివేదించినట్లు ఈఓ తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని పలాస, సోంపేటలో గల చిల్డ్రన్ హోమ్‌లలో ఖాళీగా ఉన్న పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐసీడీఎస్ పరిధిలో ఈ హోమ్‌లు నడుస్తున్నాయని, ఈ పోస్టులకు 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులు శ్రీకాకుళంలోని వాంబే కాలనీ వద్ద గల ఐసీడీఎస్ పీడీ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కుక్, హెల్పర్, ఎడ్యుకేటర్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ మ్యూజిక్ టీచర్, యోగా ఇన్‌స్ట్రక్టర్, లీగల్ కౌన్సెలర్, పారా మెడికల్, మల్టీపర్పస్ హెల్పర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

'నేటి నుంచి జీడి పరిశ్రమలు తెరుస్తాం'

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పరిసర ప్రాంతాల్లో ఉన్న జీడి పరిశ్రమలను ఆదివారం నుంచి తెరుస్తున్నామని పలాస పారిశ్రామికవాడ జీడి పరిశ్రమల సంఘం అధ్యక్షులు మల్లా రామేశ్వరం వెల్లడించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ జీడి ఉత్పత్తులు పేరుకుపోవడంతో పరిశ్రమలు తాత్కాలికంగా బంద్ చేశామని తెలిపారు. ఆదివారం నుంచి ఇంతకుమునుపు లాగానే బాయిలింగ్, కటింగ్ కొనసాగుతాయని స్పష్టం చేశారు.

స్నేహమేరా శాశ్వతం

స్నేహితుల దినోత్సవం సందర్భంగా సాక్షి ఫ్రెండ్‌షిప్ మీటర్ టెస్ట్ చేసింది. స్నేహితులతో మసలే విధానం, స్నేహం చిగురించే పద్ధతులు, అవి కొనసాగేందుకు దోహదపడే అంశాలపై వెయ్యి మందిని కొన్ని ప్రశ్నలడిగింది. ఒకే రకమైన సమాధానం ఎంత మంది చెబుతున్నారో పరిశీలించింది. మరి మీరు ఏ మీటర్‌లో ఉన్నారో చూసి తెలుసుకోండి.

-ఎచ్చెర్ల క్యాంపస్, రణస్థలం, జలుమూరు, కవిటి, నరసన్నపేట, ఎల్‌ఎన్‌పేట, టెక్కలి రూరల్, ఇచ్ఛాపురం రూరల్, హిరమండలం

స్నేహ బంధం జీవితాంతం ఉంటుందా?



• జీవన ప్రయాణంలో ఎన్నో పరిచయాలు... కొన్ని కొంతకాలం ఉంటే, కొన్ని మనం ఉన్నంతకాలం.. ఈ స్నేహబంధం జీవితాంతం ఉంటుందా అంటే. ఎస్ అంటున్నారు 40 శాతం మంది. ఉండదు అని 29 శాతం మంది అభిప్రాయం. అర్థం చేసుకోవాలని 22 శాతం మంది చెబుతున్నారు.

ఉంటుంది 40%

- ఉండదు 29%
- అర్థం చేసుకోవడంపై ఆధారపడి ఉంటుంది 22%
- ఏ బంధం శాశ్వతం కాదు 09%

ఆపద సమయంలో మీకు ఎక్కువగా అండగా ఉన్నదెవరు?



• సమస్యలు చుట్టుముట్టినప్పుడు ముందుగా గుర్తొచ్చేది, ముందుకు వచ్చేది మాత్రం స్నేహితులే అని ఇప్పటి తరం ఎక్కువగా నమ్ముతోంది. ఈ ప్రశ్నకు 54 శాతం మంది అదే సమాధానం చెప్పారు. కుటుంబ సభ్యుల కన్నా స్నేహితులు అండగా ఉంటున్నారని స్పష్టం చేశారు.

స్నేహితులు 54%

- కుటుంబ సభ్యులు 39%
- గతంలో మీ సాయం పొందినవారు 06%
- అనుకోకుండా పరిచయం అయినవారు 01%

బాల్యమిత్రులు, యుక్త వయసు వచ్చాక కలిసిన మిత్రులు.. వీరిలో ఎవరు నమ్మకంగా ఉంటారు..!



• వివిధ దశల్లో ఎంతో మంది స్నేహితులు ఉన్నప్పటికీ.. బాల్యంలో మనతో కలిసి చదువుకున్న మిత్రులతోనే ఎక్కువ అనుబంధం ఉంటుంది. ఈ సమాధానాన్నే 66 శాతం మంది చెప్పారు. ఈ మధ్యకాలంలో ఎక్కువగా జరుగుతున్న గెట్ టుగెదర్ లే అందుకు నిదర్శనం.

చిన్ననాటి స్నేహితులు 66%

- టీనేజ్ ఫ్రెండ్స్ 18%
- సహచర ఉద్యోగులు 04%
- ఒకే గ్రామస్తులు 12%

తెలిసి కూడా మోసం చేసిన స్నేహితుడు.. తన అవసరానికి మళ్లీ మన దగ్గరకు వస్తే ఏం చేస్తారు..!!

• ఒకసారి మోసపోతే అది మోసం చేసిన వాడి తప్పు. మళ్లీ మళ్లీ మోసపోతే కచ్చితంగా మోసపోతున్న వారిదే తప్పు. అందుకే మోసగాళ్లను దూరం పెడతామని సగానికిపైగా తెలిపారు. బాధని తెలియచేసి మరోసారి అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్త పడాలని 28 మంది చెబుతున్నారు.

మరోసారి మోసపోకుండా దూరం పెడతారు 51%

- తప్పు తెలుసుకున్నాడని సాయం చేస్తారు 28%
- మొదటిలా మళ్లీ స్నేహం చేస్తారు 03%
- తన అవసరం తీర్చి వదిలేస్తారు 18%

మనస్పర్థలతో మొదలైన స్నేహం.. చిరకాలం ఉంటుందంటారు..! మీ జీవితంలో అలా జరిగిందా!!

• చిన్న చిన్న అపార్థాలు, మనస్పర్థలతో మొదలైన స్నేహాలు వారి పొరపాటును తెలుసుకున్నప్పుడు ఇంకా బలంగా ఉంటాయని కొందరు నమ్మితే... మొదటిలోనే కలహాలు రేగినప్పుడు ముందు ముందు ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయోనని అప్రమత్తమవుతామని చెబుతున్నారు సగం మంది.

జరిగింది 50%

జరగలేదు 50%

సర్వే ఇలా...

- 1000 మంది అభిప్రాయాలను తెలుసుకున్నాం.
- అన్ని వయసుల వారినీ సర్వేలో భాగస్వాములను చేశాం.
- జిల్లా వ్యాప్తంగా 50 శాతం మగ, 50 శాతం ఆడవారి నుంచి శాంపిల్స్ సేకరించాం.

నేస్తం నువ్వే సమస్తం

- పాత స్నేహమే గొప్పది
- ఆన్‌లైన్ స్నేహాలతో అనర్థమే
- భేదభావాలు లేని బంధమే స్నేహం
- 'సాక్షి' టాక్‌షోలో టెక్కలి డిగ్రీ కాలేజీ విద్యార్థులు

'కొత్త మిత్రుల కోసం ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్‌లో గాలిస్తుంటాం.. పాత మిత్రులను మాత్రం కలవడం మర్చిపోతుంటాం. అందుకే ఆ రోజులే బాగుండేవి..' కొందరు యువకుల అభిప్రాయమిది.

'కాలం మారుతుంది. వయసూ పెరుగుతుంది. మనుషులూ మారిపోతారు.. కానీ స్నేహం మారకూడదు' కొందరు యువతుల మాట ఇది.

'మన కష్టానికి కన్నీరు పెట్టాలి. మన సంతోషానికి తను నవ్వాలి. ఆ మనిషే మన బెస్ట్ ఫ్రెండ్..' మెజారిటీ స్టూడెంట్ల ఒపీనియన్ ఇది.

టెక్కలి డిగ్రీ కాలేజీ విద్యార్థులు స్నేహగీతం ఆలపించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా.. బెస్ట్ ఫ్రెండ్స్ క్వాలిటీస్‌ను 'సాక్షి'తో పంచుకున్నారు. కళ్లకు సెల్‌ఫోన్ గంతలు కట్టుకున్న ఈ కాలంలో స్వచ్ఛమైన స్నేహాలు కరువైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిక్వెస్టు, యాక్సెప్ట్‌ల పరిధి దాటితే స్నేహం శాశ్వతంగా నిలుస్తుందని అన్నారు. - టెక్కలి

స్వచ్ఛమైన బంధం



స్నేహితుల మధ్య స్వచ్ఛమైన అనుబంధం ఉండాలి. అవసరానికి కాకుండా సాయం చేసే మనసు కలిగి ఉండాలి. పాతతరం స్నేహం ఎంతో బలంగా ఉండేది. ప్రస్తుతం శాశ్వతమైన స్నేహం కనిపించడం లేదు.

- కె.కీర్తిక



సాక్షి టాక్‌షోలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఉత్సాహం

స్వచ్ఛమైన పాలలా ఉండాలి



స్నేహం స్వచ్ఛమైన పాలలా ఉండాలి. మనం ఎక్కడ ఉన్నా మన పాత మిత్రులను మరచిపోకూడదు. మన స్థాయి పెరిగినా మన చిన్ననాటి స్నేహితులను గుర్తు పెట్టుకోవాలి.

- కె.అఖిల్

మనదే ఆ బాధ్యత



మంచి స్నేహితుడిని ఎంపిక చేసుకునే బాధ్యత మనదే. స్నేహం అనేది పాఠశాల, కళాశాలతో ఆగిపోకూడదు. స్నేహం పేరుతో ఆ బంధాన్ని కలుషితం చేయకూడదు.

- బి.రాజు

మనస్పర్థలు ఉండకూడదు



స్నేహితుల మధ్య మనస్పర్థలు ఉండకూడదు. కాలం మారినా.. మనుషులు మారినా.. పాత తరం స్నేహం ఎంతో గొప్పది. వారిని ఆదర్శంగా తీసుకుని స్నేహం కొనసాగించాలి. ఆన్‌లైన్ స్నేహం అంత మంచిది కాదు.

- సీహెచ్ శిరీష

కష్టాల్లో ఆదుకోవాలి..



కష్టం వచ్చినప్పుడు పక్కనే ఉంటూ ఆదుకునేవాడు నిజమైన స్నేహితుడు. ఒకప్పుడు ఫోన్లు లేని కాలంలో తరచూ స్నేహితులు కలిసేవాళ్లు. ఇప్పుడు హాయ్ బాయ్‌కే పరిమితమవుతున్నారు.

- ఎన్.నందిని

సన్మార్గం ముఖ్యం



మనకు ఉండే మంచి స్నేహితులతోనే మన క్యారెక్టర్ డిసైడ్ చేయవచ్చు. మన స్నేహితులు చెడు మార్గంలో నడిస్తే వారిని సన్మార్గంలో నడిపించాలి. ఆత్మీయ సమ్మేళనాల్లో కలిసే స్నేహం కాకుండా కష్ట, నష్టాల్లో వెన్నుతట్టే విధంగా ఉండాలి.

- టి.హారిక

చెప్పుడు మాటలు వద్దు



స్నేహితుల మధ్య వైరాన్ని సృష్టించడానికి కొంత మంది చెప్పుడు మాటలు చెబుతారు. అలాంటి వారిని దూరం పెట్టాలి. స్నేహం అంటే నమ్మకంతో కూడిన బంధం.

- జి.భవాని

కుల, మతాలు అడ్డు కాదు



స్నేహానికి కుల, మతాలు అడ్డుకాకూడదు. పేద, ధనిక భేదం ఉండకూడదు. స్నేహం అనే ముసుగులో మోసాలకు పాల్పడకూడదు.

- సీహెచ్ సంతోష్‌కుమార్



కలుసుకుంటాం.. ప్రతి సాయంత్రం

శ్రీకాకుళం గాంధీ పార్కులో స్నేహితుల సందడి

స్నేహ హస్తాలు

ఊరి నుంచి గల్ఫ్ దాకా..

ఇచ్ఛాపురం మండలంలోని కేదారిపురం గ్రామంలోని కొందరు స్నేహితులు గ్రామంలోనే ఉంటూ వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాళ్లు. ఐదేళ్ల కిందట ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిపోయారు. అయినా ఇక్కడ ఉన్న స్నేహితుల సాయంతో ఆర్తులను ఆదుకుంటున్నారు. 'కేదారిపురం గల్ఫ్ ఫౌండేషన్' పేరుతో సేవలు చేస్తున్నారు.



దివ్యాంగుడికి ఆర్థిక సాయం అందిస్తున్న గల్ఫ్ ఫౌండేషన్ స్నేహితులు

ఉపాధ్యాయులే సమాజ సేవకులు

డీఎస్సీ–2018లో ఎంపికైన తెలుగు అధ్యాపకులు వీరంతా. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరంతా డీఎస్సీ కోచింగ్‌లో పరిచయం, తర్వాత స్నేహితులుగా మారి, ఉద్యోగాలు వచ్చిన తర్వాత తమ స్నేహాన్ని కొనసాగించేందుకు 2019లో 'సేవా సదన్' పేరుతో సేవా సంస్థను నెలకొల్పారు. ప్రకాశం జిల్లాకు చెందిన మాల్యాద్రి అధ్యక్షుడుగా, శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి.శంకర్‌రెడ్డి, కర్నూల్ జిల్లాకు చెందిన సులోచన, విజయనగరం జిల్లాకు చెందిన నాగ సూర్యశర్మ, ప్రకాశం జిల్లాకు చెందిన కె.ఏసునాథంలు క్రియాశీలక సభ్యులుగా ఉంటూ నెలకు రెండు కార్యక్రమాలు చొప్పున ఇప్పటి వరకు నలభై వరకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పదవీ విరమణ పొందే వరకు సేవలు చేస్తామని ఈ మిత్రులంటున్నారు.



తల్లిదండ్రులను కోల్పోయిన తేలుకుంచి చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయ స్నేహ బృందం



2018 డీఎస్సీ తెలుగు అధ్యాపక స్నేహ బృందం

-ఇచ్ఛాపురం రూరల్

రామయ్యా.. హామీల మాటేమిటయ్యా..!

- మాటల మాంత్రికుడిగా మిగిలిపోతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు దూరం
- కేంద్రంలో ఉన్నా కనిపించని ప్రభావం
- ధరల నియంత్రణలో విఫలం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

☛ గ్యాస్ సిలిండర్లు సంవత్సరానికి మూడు ఉచితంగా ఇవ్వబోతున్నాం. మూడు సిలిండర్లు ఎందుకని చంద్రబాబు ఇవ్వబోతున్నారు..? సిలిండర్ల ధర జగన్ పెంచారు. ఇప్పుడు కొనలేకపోతున్నాం. ఇబ్బంది ఉంది కాబట్టి మళ్లీ గ్యాస్ పొయ్యల మీద వంట చేసుకునేందుకు మూడు సిలిండర్లు ఉచితం.
☛ వైఎస్ జగన్ ప్రభుత్వంలో పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగిపోయాయి. నిత్యావసర సరుకులు కూడా భారీగా పెరగడంతో కొనలేకపోతున్నాం. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలను స్థిరీకరిస్తాం.
☛ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల్ని పట్టించుకోలేదు. అన్ని రకాలుగా ముంచేశారు. రైతుల్ని ఆదుకోవడానికి ఏటా సీజన్ ప్రారంభంలోనే రూ. 20వేల పెట్టుబడి సాయం అందిస్తాం. ☛ సముద్ర వేట విరామ సమయంలోనే మత్స్యకారులకు రూ. 20వేలు అందజేస్తాం. మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తాం. వారికి అవసరమైన బోట్లు, వలలు, పరికరాలు అందిస్తాం.అధునాతన పద్ధతుల్లో వేటకు సహకరిస్తాం.
☛ ఆర్టీసీ ఛార్జీలు భరించలేని విధంగా ఉన్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తాం. జిల్లాలో ఎక్కడ తిరగాలన్నా ఆర్టీసీ బస్సు ఛార్జీలు ఫ్రీ చేసి, ఆడపడుచులు ఎక్కడ తిరగాలన్నా పైసా ఖర్చు లేకుండా చేస్తాం. ☛ చదువుకున్న పిల్లలు ఎంత మంది ఉన్నా సరే ప్రతి పిల్లాడికి రూ.15వేలు చొప్పున.. ఇద్దరుంటే రూ.30వేలు.. ముగ్గురుంటే రూ.45 వేలు... నలుగురుంటే రూ.60వేలు.. ఇంకా ఎంతమంది ఉన్నా అందరికీ రూ.15వేలు చొప్పున మీ అకౌంట్‌లో వేయడానికి చంద్రబాబు నిర్ణయించారు.

ఎన్నికలకు ముందు ప్రస్తుత కేంద్ర మంత్రి, అప్పటి ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేసిన ప్రసంగాలు, ఇచ్చిన హామీలు ఇవి. ఇప్పుడు వారు అనుకున్నట్టే అధికారంలోకి వచ్చారు. బాధ్యతలు స్వీకరించి 50రోజులు దాటిపోయింది. వీటిలో ఒక్కటంటే ఒక్కటైనా అమలు చేశారా? అంటే ఏమీ లేదనే చెప్పాలి. పైగా ఆయన కేంద్ర మంత్రిగా కూడా బాధ్యతలు స్వీకరించారు. కానీ ఇప్పుడు ఎన్నికల ముందు మాటలన్నీ మర్చిపోయినట్టు కనిపిస్తున్నారు.

ధరలు తగ్గించారా?

వైఎస్ జగన్ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు పెరిగిపోయాయని గగ్గోలు పెట్టారు. పోనీ ఇప్పుడేమైనా తగ్గించారా అంటే అదేమీ లేదు. వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోయాయని ఆరోపించిన రామ్మోహన్ నాయుడు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలోనే మంత్రిగా ఉన్నా ఆ ధరల గురించి మాటైనా మాట్లాడడం లేదు. గ్యాస్ ధరల పెంపు కూడా వైఎస్ జగన్‌పైనే వేసి ఊరూరా ప్రచారం చేశారు. ఇప్పుడు మాత్రం దాన్ని తగ్గించి చూపలేకపోతున్నారు.

కోటలు దాటే మాటలు

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాటలు కోటలు దాటుతున్నాయి గానీ చేతలే దాటడం లేదని జిల్లా వాసులంటున్నారు. మత్స్యకారుల వేట విరామం సమయం దాటిపోయి చాలా రోజులైంది. మధ్యలో వర్షాలు కూడా వచ్చి మత్స్యకారులు వేటకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు. వారికి ఇస్తామన్న రూ.20 వేలు ఇంతవరకు ఇవ్వలేదు. ఖరీఫ్ సీజన్ సగానికి వచ్చేసింది. ఉడుపులు అయిపోయాయి. కానీ, వారికింతవరకు పెట్టుబడి సాయం అందలేదు. వ్యవసాయ ఖర్చుల కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడి సాయమే కాదు ప్రభుత్వం విధిగా అందించాల్సిన విత్తనాలు, ఎరువుల విషయంలోనూ అదే నిర్లక్ష్యం కన్పించింది. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు దాటిపోయింది. పిల్లల్ని చదివించేందుకు తల్లులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహాన్ని నేటికీ ఇవ్వలేదు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ. 15వేలు చొప్పున ఇస్తామని చెప్పి ఇంకా ఇవ్వలేదు. ఇవే కాదు మహిళలకు ప్రతి నెలా రూ. 1500, నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగాలు... అవి ఇచ్చేలోపు నెలకి రూ. 3వేల నిరుద్యోగ భృతి కూడా మర్చిపోయారు. 50 ఏళ్ల పింఛన్ ఇవ్వడం మాట దేవుడెరుగు.. ఉన్నవి తీసేస్తున్నారు.

కొత్తవేవీ..?

తాను ఎంపీగా ఎన్నికయ్యాకే జిల్లాలో రైల్వే అభివృద్ధి జరిగిందని గొప్పలు చెప్పుకుంటారు. కానీ, దేశ వ్యాప్తంగా ఏం జరిగాయో అవే జరిగాయే తప్ప వ్యక్తిగత ప్రాధాన్యతతో జరిగినవేవి లేవు. పక్కనే ఉన్న విజయనగరం జిల్లాలో అనేక రైల్వే స్టేషన్లు ఆధునీకరణ జరిగాయి. అవన్నీ ఎంపీల వ్యక్తిగత ఖాతాలో వేసుకుంటే.. ఇక్కడ అదనంగా చేసిందేంటో చెప్పడానికి లేవు. కేంద్రమంత్రిగా ఉండటంతో జిల్లాకు ప్రత్యేక ప్రాజెక్టులేమైనా వస్తాయేమోనని ప్రజలంతా ఆశించారు. కానీ ఒక్కటంటే ఒక్కటీ జిల్లాకు ప్రత్యేక కేటాయింపు లేదు.

క్లుప్తంగా

అగ్నివీర్ పథకంపై అవగాహన



మాట్లాడుతున్న సందీప్

నరసన్నపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అగ్నివీర్ పథకంపై యువత అవగాహన పెంచుకోవాలని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రతినిధులు ఎస్.సందీప్, దేవకాంత్ మిశ్రాలు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అగ్నివీర్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ దేశ సేవలో నాలుగేళ్లు పాల్గొనే అవకాశం వస్తుందని, సర్వీసు నుంచి రిటైర్ అయిన వారికి ఏక మొత్తంలో రూ. 7 లక్షలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అనంతరం వీరికి పోలీస్, పారామిలటరీల్లో రిజర్వేషన్లు కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.లత నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్, జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.సుధ తదితరులు మాట్లాడారు.

'ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలి'



ఫిషింగ్ హార్బర్ పనులు జరుగుతున్న తీరు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెం సముద్ర తీరంలో రూ.365 కోట్లతో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుడగుట్లపాలెంలో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులు ఎట్టి పరిస్థితుల్లో నిలుపుదల చేయవద్దని సూచించారు. పనుల పురోగతిపై 15 రోజులకోసారి సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. భూ కేటాయింపులపై రెవెన్యూ అధికారులు పరిస్థితి వివరించారు. పనులు పురోగతిపై రెండు వారాలకు ఒక సారి నివేదిక అందజేయాలని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగయ్య, మత్స్యశాఖ జేడీ పీవీ శ్రీనివాసరావు, ఎచ్చెర్ల, రణస్థలం తహసీల్దార్లు ఎ.సింహాచలం, ఎన్.ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దార్ చక్రవర్తి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

'ప్రైవేటు కాలేజీల్లో నిబంధనలు తప్పనిసరి'



జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్ఐఓ తదితరులు

నరసన్నపేట: ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆర్ఐఓ పి.దుర్గారావు అన్నారు. స్థానిక జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలకు ఇచ్చిన అనుమతి పత్రాలను పరిశీలించారు. ఎన్ని గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, అందరినీ నిబంధనల మేరకు చేర్చుకున్నారా తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైన్స్ ల్యాబ్‌లో అన్ని పరికరాలు ఉండాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా నిర్వహించాలని, అదనపు సెక్షన్లు ఉండకూడదని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కమిటీ సభ్యులు శ్యామ్ సుందరరావు ఉన్నారు.

సుశాంత్ శతకాల మోత



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన క్రికెటర్ నంబళ్ల సుశాంత్ తన భీకర ఫామ్‌ను కొనసాగిస్తూ సెంచరీల మోత మోగిస్తున్నాడు. ఏసీఏ అంతర్‌జోనల్ అండర్–19 పురుషుల త్రీడేస్ మ్యాచ్‌ల క్రికెట్ టోర్నీలో ఈ యువ కెప్టెన్ 123 పరుగులతో కదంతొక్కాడు. ఈ సీజన్‌లో ఇప్పటికే నాలుగు సెంచరీతో కదం తొక్కిన ఈ యువకిషోరం బలమైన విశాఖపట్నంతో జరిగిన కీలకమ్యాచ్‌లో శ్రీకాకుళం ఓటమిపాలైనప్పటికీ.. ఇన్నింగ్స్‌తో ఓటమి నుంచి కాపాడాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 88 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా రెండో ఇన్నింగ్స్‌లో ఒంటరి పోరాటం చేసి 123 పరుగులు చేసి జట్టును నడిపించడం సెలెక్టర్లను సైతం కట్టిపడేసింది.

ఈ సీజన్‌లో టాప్ స్కోరర్‌గా..

వైఎస్సార్ కడప జిల్లాలో కేఓఆర్ఎం కాలేజ్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ఏసీఏ అంతర్‌జోనల్ పురుషుల అండర్–19 త్రీడేస్(టెస్ట్) మ్యాచ్‌ల టోర్నీలో శ్రీకాకుళం జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న నంబళ్ల సుశాంత్ టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. ఇటీవలి ముగిసిన పరిమిత ఓవర్ల వన్డే టోర్నీలో 5 మ్యాచ్‌ల్లో 341 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన విషయం తెలిసిందే.

దినసరి.. వారి పని సరి



ఈఓ చంద్రశేఖర్‌కు విన్నవించుకుంటున్న దినసరి వేతనదారులు

- ఆదిత్యాలయంలో దినసరి ఉద్యోగులపై వేటు
- మొత్తం 48 మందికి ఉద్వాసన పలకాలంటూ ఆదేశాలు
- గత ప్రభుత్వ హయాంలో నియామకాలపై విచారణకు ఆదేశం

అరసవల్లి: ఆదిత్య క్షేత్రంలోని దినసరి ఉద్యోగులపై టీడీపీ 'వేటు'కత్తి దూసింది. కొన్నేళ్లుగా ఆలయంలో దినసరి వేతన దారులుగా పనిచేస్తున్న 48 మందిని తక్షణమే విధుల నుంచి ఉద్వాసన పలికేలా ఆదేశాలు జారీ చేయడం చర్చనీయాంశమైంది. ఆలయంలో 2019కి ముందు నుంచి ఓ 12 మంది దినసరి ఉద్యోగులుగా పనిచేస్తుండేవారు. కాలక్రమంలో ఆలయం అభివృద్ధి చెందడం, అసిస్టెంట్ కమిషనర్ స్థాయి నుంచి డిప్యూటీ కమిషనర్ స్థాయికి ఆలయ హోదా పెరగడం, భక్తుల రాకపోకలు అధికం కావడంతో 2021లో మరో 36 మందిని దినసరి పద్ధతిలోనే నియమించారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వీరిని తొలగించేందుకు విశ్వ ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కృష్ణమాచార్యులు దినసరి ఉద్యోగులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించేందుకు అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేసి కృష్ణమాచార్యులుతో పాటు జూనియర్ అసిస్టెంట్ శ్యామలరావును విధుల నుంచి సస్పెండ్ చేశారు. సరిగ్గా ఇదే వ్యవహారాన్ని అడ్డం పెట్టుకుని గత ప్రభుత్వంలో నియామకాలన్నీ రద్దు చేసేలా టీడీపీ కీలక నేతలు ప్రణాళిక రచించారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ దగ్గర ఈ వ్యవహారంపై పలుమార్లు 'పంచాయతీ' జరిగింది. అనంతరం ఆలయ ఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ ఉద్యోగులందరికీ ఉద్వాసన పలకాలంటూ ఆదేశాల అమలుకు రంగం సిద్ధం చేశారు. ఎమ్మెల్యే శంకర్‌కు అనుకూలంగా ఉండే వాళ్లను కొత్తగా ఆలయంలో నియమించేలా జాబితాను తయారు చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ఏళ్లుగా ఆలయాన్నే నమ్ముకుని బతుకుతున్న 48 మంది చిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయి.

గత ప్రభుత్వ నియామకాలపై విచారణకు ఆదేశాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆదిత్యాలయంలో నియమితులైన అందరిపైనా విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం సంచలనంగా మారింది. గత ప్రభుత్వం హయాంలో నిరుద్యోగులకు ఉపాధిలో భాగంగా ఈ ఆలయంలో కొందరిని దినసరి వేతనదారులుగా నియమించారు. ఇందులో అత్యధికంగా అరసవల్లి ప్రాంతానికే చెందిన వారిని పార్టీలకు అతీతంగానే అప్పట్లో నియమించారు. 2019కి ముందు కూడా ఇదే ఆలయంలో 12 మంది వరకు దినసరి వేతనదారులుగా ఓచర్ పేమెంట్ విధానంలో పనిచేశారు. తర్వాత ఆలయ పరిధి పెరగడంతో అన్నదాన ప్రసాదాల తయారీ, ఆఫీస్ సహాయకులు, మేళవాయిద్యాల సిబ్బంది, సబార్డినేట్లు, స్వీపర్ల కింద కొందరిని నియమించారు. వీరి నియామకాలపై విచారణ చేపట్టాలంటూ తాజాగా కమిషనరేట్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. రాజమహేంద్రవరం ఆర్‌జేసీ క్యాడర్ అధికారి సుబ్బారావును విచారణాధికారిగా నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అప్పటి ఈఓ హరిసూర్యప్రకాష్‌ను కూడా విచారించనున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.

పెండింగ్ జీతాలివ్వకుండా..

వాస్తవానికి ఈ 48 మంది ఉద్యోగులకు ఆరు నెలల వేతనాలు ఇవ్వాల్సి ఉంది. దీనిపై ఇటీవలే దినసరి వేతనదారులంతా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్‌ను కలిసి విన్నవించుకున్నారు. దీనిపై ఆయన కూడా ఉన్నతాధికారులకు ఆమోదం కోరుతూ నివేదికను పంపించారు. కానీ అంతలోనే వారి ఉద్యోగాలే పీకేస్తున్నట్లు ప్రకటించడంతో వారంతా తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు



దినసరి వేతన దారుల వ్యవహారంలో నియామక ప్రక్రియపై విచారణకు ఆదేశించారు. వీరికి ఉద్యోగాలు ఇవ్వడం, జీతాలు చెల్లించడంపై విచారణ చేపట్టనున్నారు. అలాగే వీరికి పెండింగ్ జీతాలిచ్చే అంశంపై కూడా కమిషనర్‌కు నివేదించాను. దీనిపై ఇంకా ఎలాంటి అనుమతి రాలేదు. ఇక వీరి వ్యవహారాలతో పాటు ఆలయంలో చోటుచేసుకున్న పరిణామాలపై స్థానిక ఎమ్మెల్యే శంకర్ దృష్టిలో పెట్టాను. అలాగే ప్రస్తుతానికి దినసరి వేతనదారుల్లో అవసరమైన కొందరికే విధులకు అవకాశం కల్పించనున్నాం. తదుపరి ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతాను.

– ఎస్.చంద్రశేఖర్, ఆలయ ఈఓ

ఆర్‌జీయూకేటీ ప్రవేశాల
రెండో జాబితా విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రవేశాల రెండో జాబితా శనివారం విడుదల చేశారు. మొదటి జాబితా జూలై 11వ తేదీన విడుదల చేసి, 26, 27 తేదీల్లో స్థానిక క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. 1035 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా, 863 మంది హాజరయ్యారు. 172 మంది హాజరు కాలేదు. ప్రత్యేక కేటగిరీ కింద 75 మందికి ప్రవేశాలు కల్పించనున్నారు. వీరి అర్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతోంది. జూలై 30వ తేదీ వరకు హాజరుకాని వారికి మళ్లీ ఆప్షన్ల నమోదు, ప్రవేశాలు పొందిన వారికి క్యాంపస్ మార్పులకు అవకాశం ఇచ్చారు. ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకున్న వారికి 10వ తరతగతి మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించారు. విద్యార్థులు ఇచ్చుకున్న ఆప్షన్ క్రమ సంఖ్య బట్టి శ్రీకాకుళం, నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు క్యాంపస్‌ల్లో సీట్లు కల్పించారు. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీలో శనివారం నాలుగు క్యాంపస్‌లకు సంబంధించిన రెండో జాబితాను అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రతో కూడిన అధికారులు విడుదల చేశారు.

- ఎంపిక జాబితా వర్సిటీ వెబ్ సైట్ డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఆర్‌జీయూకేటీ.ఐఎన్‌లో అందుబాటులో ఉంచారు.
- ఈ నెల 9వ తేదీన ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. శ్రీకాకుళం, నూజివీడు క్యాంపస్‌లకు సంబంధించి నూజివీడులో, ఇడుపులపాయ, ఒంగోలుకు సంబంధించి ఇడుపులపాయలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.
- దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు హాజరు కావాల్సి ఉంటుంది.
- ప్రత్యేక కేటగిరీల దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్సుతో పాటు ఇతర ప్రత్యేక కేటగిరీల జాబితా ఆగస్టు రెండో వారంలో విడుదల చేస్తారు. ఈ కేటగిరిలో 75 ప్రవేశాలు శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి కల్పిస్తారు.
- 9వ తేదీన నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కాని విద్యార్థులు సీటు కోల్పోవాల్సి ఉంటుంది.
- మొదటి కౌన్సెలింగ్‌లో సీట్లు లభించిన విద్యార్థులు, రెండో కౌన్సెలింగ్‌లో సీట్లు లభించే విద్యార్థులు ఈ నెల 19, 20 తేదీల్లో సీటు లభించిన క్యాంపస్‌ల్లో సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది.
- నాలుగు క్యాంపస్‌ల్లో ఈ నెల 21నుంచి క్లాస్ వర్క్ ప్రారంభించ నున్నారు.
- షెడ్యూల్ మేరకు క్లాస్‌వర్క్ ఉంటుందని, రెండో జాబితాలో సీట్లు లభించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాలన ధన బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి వివరించారు. విద్యార్థులకు వసతి గృహం సీట్లు సైతం అలాట్ చేయనున్నట్లు చెప్పారు.

దివ్యాంగులకు అండగా ఉంటాం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో శనివారం సాయంత్రం వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం సాధికారత కేంద్ర మంత్రిత్వ శాఖ, ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆలింకో) సహకారంతో వికలాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర మంత్రిగా తన తొలి కార్యక్రమాన్ని దివ్యాంగులతో నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 479 మందికి రూ.73.32 లక్షలు విలువ చేసే 823 ఉపకరణాలను ఒక్క రోజే పంపిణీ చేసే అవకాశం తనకు కలిగిందని చెప్పారు. ప్రతి వికలాంగుడికి సహాయపడే ప్రతి సహాయ ఉపకరణాన్ని అందజేస్తామని తెలిపారు. దివ్యాంగుల కోసం పింఛన్ రూ.6 వేలు పెంచి ఇస్తున్న ప్రభుత్వం దేశంలో తమదేనని అన్నారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఆర్టీసీ బస్సుల్లో సులువుగా ప్రయాణించేందుకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అన్ని ప్రభుత్వ శాఖలు తమ నిధుల్లో కనీసం మూడు శాతం దివ్యాంగుల అభ్యున్నతి కోసం ఖర్చు చేసేలా సర్క్యులర్ జారీ చేస్తామని వెల్లడించారు.

కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం, నరసన్నపేట శాసన సభ్యులు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవిత, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, జిల్లా ఉపాధి కల్పన అధికారి సుధ, టూరిజం అధికారి నారాయణరావు, సెట్ శ్రీ సీఈఓ ప్రసాదరావు, కింజరాపు హరిప్రసాద్, ఆలింకో కోఆర్డినేటర్ రవిశంకర్, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి తదితరులు హాజరయ్యారు.

వయనాడ్‌కు నివాళిగా..



పర్యావరణ పరిరక్షణకు అంతా కృషి చేయాలని ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసకు చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ పిలుపునిచ్చారు. కేరళలో వయనాడ్ బాధితులకు నివాళిగా గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పం రూపొందించారు.

– ఆమదాలవలస

కనిమెట్ట పోస్టాఫీసులో మూడో రోజు విచారణ



కనిమెట్ట బ్రాంచి పోస్టాఫీసులో విచారణ జరుపుతున్న అధికారులు

పొందూరు: మండలంలోని కనిమెట్ట బ్రాంచ్ పోస్టాఫీసులో జరిగిన ఆర్థిక అవకతవకలపై జిల్లా పోస్టల్ అధికారులు మూడో రోజు విచారణ జరిపారు. బీపీఎం లోకేష్ సమక్షంలో బాధితుల అర్జీ పుస్తకాలు ఇతర రికార్డులను పరిశీలించారు. సుమారు రూ. 1.20 లక్షలు ఖాతాదారుల నుంచి సేకరించిన నగదును వారి ఖాతాలో జమ చేయకుండా అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించినట్లు అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెంట్ ఆర్.గౌరీశంకర్ తెలిపారు.

పంద్రాగస్టు వేడుకలకు మైదానం పరిశీలన

శ్రీకాకుళం న్యూకాలనీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. 78వ స్వాతంత్ర్య వేడుకలకు ఆతిథ్యమిస్తున్న శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానాన్ని శనివారం ఆయన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. మైదాన బ్లూ ప్రింట్‌ను పరిశీలించి, అధికారులతో చర్చించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

లారీ-టిప్పర్ ఢీ



స్తంభించిన ట్రాఫిక్

శ్రీకాకుళం రూరల్: రాగోలు మీదుగా వాకలవలసకు వెళ్లే రోడ్డులో శనివారం స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. వాకలవలస జంక్షన్ వద్ద శ్రీకాకుళం నుంచి వస్తున్న డీసీఎం లారీ ఆమదాలవలస నుంచి వస్తున్న టిప్పర్ ఒకదానికి ఒకటి ఎదురెదురుగా ఢీకొట్టాయి. దీంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఒక్కసారిగా రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ పోలీసులు, రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

తాగునీరివ్వకుండా కక్ష సాధింపు



కుళాయిలకు నీరు రావడం లేదని చూపిస్తున్న బాధితులు

సారవకోట: మండలంలోని అలుదు పంచాయతీ వడ్డినవలస గ్రామంలో వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల ఇళ్లకు ఏర్పాటు చేసిన కుళాయిలకు నీళ్ల రాకుండా దమ్మీలను శనివారం ఏర్పాటు చేశారు. ఈ గ్రామానికి చెందిన వైస్ సర్పంచ్ ఇప్పిలి సూర్యనారాయణ, బడ్డి లక్ష్మణల ఇళ్లకు ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలకు నీరు రాకుండా పైపులైన్లలో డమ్మీలు ఏర్పాటు చేశారు. తమపై కక్ష సాధింపుగా పైపులైన్‌లో డమ్మీలు ఏర్పాటు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై
ఉక్కుపాదం మోపుతాం



కరజాడ ప్రాంతంలో అక్రమ రవాణా జరగకుండా ట్రెంచ్‌లు కొట్టించిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్.గణపతిరావు అన్నారు. మండల పరిధిలోని ఇసుక అక్రమ రవాణా చేస్తున్న కరజాడ, బైరి, రోణంకి, బట్టేరు ప్రాంతాలను ఆయన శనివారం పరిశీలించారు. శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు గాను రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. ఎక్కడెక్కడ అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారో ముందస్తుగా గుర్తించి ఆ రహదారుల ప్రాంతాల్లో ట్రెంచ్‌లు కొట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి ఆయా ప్రాంతాల వద్ద 24/7 కింద వీఆర్వోతో పాటు ఒక తలయారీను మూడు షిఫ్టులు డ్యూటీలు వేసినట్లు ఆయన వెల్లడించారు.

కాఖండ్యాంలో కందకాల తవ్వకం

బూర్జ: మామిడివలస పంచాయతీ కాఖండ్యాం ర్యాంపు నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా కందకాలు తవ్వించినట్టు తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ శనివారం తెలిపారు. అలాగే రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి చిన్నలంకాం–నారాయణపురం గ్రామాల రహదారిలో ప్రత్యేక విధులు వేశామన్నారు. ఆమె శనివారం రెవెన్యూ సిబ్బందితో పర్యవేక్షణ చేశారు. కార్యక్రమంలో డీటీ బి. సంతోష్‌కుమార్. రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బట్టేరు ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం



బూర్జ: చిన్నలంకాం-కాఖండ్యాం మధ్య ఉన్న కందకాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ

'అణుపార్కు ప్రహరీ నిర్మాణం ఆపాలి'



కోటపాలెంలో కొవ్వాడ అణుపార్కు రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, గ్రామస్తులు

రణస్థలం: కొవ్వాడ అణుపార్కు రద్దు చేయాలని, ప్రహరీ నిర్మాణం ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, నాయకులు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. కొవ్వాడ అణుపార్కు రద్దు చేయాలని కోరుతూ కొవ్వాడ అణు ప్రభావిత కొవ్వాడ, కోటపాలెం, అల్లివలస, పాతర్లపల్లి గ్రామాల్లో శనివారం పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రంలో మితివిర్థిలో పెట్టాల్సిన అణువిద్యుత్ కేంద్రాన్ని అక్కడ ప్రజలు వ్యతిరేకిస్తే బీజేపీ ప్రభుత్వం అక్కడ రద్దు చేసి ఏపీలోని కొవ్వాడకు తరలించిందని విమర్శించారు. కొవ్వాడలో అణుపార్కు పెట్టడమంటే ఉత్తరాంధ్రలో అణుబాంబు పెట్టడమేనని అన్నారు. కొవ్వాడ భూకంపాల జోన్‌లో ఉందని, ఇక్కడ అణుపార్కు పెట్టడం అత్యంత ప్రమాదకరమని తెలిపారు. అభివృద్ధి చెందిన అమెరికా, జర్మనీ, జపాన్ లాంటి సాంకేతిక పరిజ్ఞానం గల దేశాలు అణు విద్యుత్ కేంద్రాలను మూసివేస్తున్నాయని, 1979లో అమెరికా త్రీమైల్ ఐలాండ్‌లో అణు ప్రమాదం జరిగిన తర్వాత కొత్తగా అణువిద్యుత్ కేంద్రాలు పెట్టలేదని అన్నారు. ప్రజలకు అత్యంత చౌకగా, ఎలాంటి ప్రమాదం లేని గాలి, నీరు, సూర్యరశ్మి మొదలగు వాటితో విద్యుత్ ఉత్పత్తి చేసి, ప్రజల అవసరాలను తీర్చవచ్చునని, కానీ అత్యంత ప్రమాదకరమైన, ఖరీదైన అణువిద్యుత్ కేంద్రాలు మనకు అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, గ్రామస్తులు గొర్లె తిరుపతినాయుడు, అల్లిపల్లి రాము, సుంకర పాపారావు, చౌదరి నారాయణరావు, లక్ష్మణరావు, సీఐటీయూ నాయకులు ఎల్ రామప్పడు, ఎమ్. రమణ, జె. గంగరాజు తదితరులు ఉన్నారు.

సంతకు వెళ్లే దారిలో అక్రమ నిర్మాణం



గోరువాని చెరువు గట్టుపై సంతకు వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న గోడ

నరసన్నపేట: నరసన్నపేటలో గడిచిన 50 రోజులుగా టీడీపీ కార్యకర్తలు నానా హడావుడి చేస్తున్నారు. స్థానిక సంతపేటకు వెళ్లే మార్గంలో గోరువాని చెరువు వద్ద విలువైన ప్రభుత్వ స్థలంలో ఒకాయన అక్రమ నిర్మాణానికి పాల్పడుతున్నారు. ఇప్పటికే చెరువు గట్టుకు ఆనుకొని రెండు ఇళ్లు నిర్మించిన ఈయన.. ఆ వెనుక భాగాన కూడా ఆక్రమణలకు పాల్పడుతుంటే పంచాయతీ సిబ్బంది అడ్డుకున్నారు. ఇప్పుడు ఏకంగా సంతపేటకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఆనుకొని గోడ కట్టడానికి చూస్తున్నారు. ఈ గోడ వద్ద పంచాయతీ బావి కూడా ఉంది. ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకునేందుకు టీడీపీ నాయకులతో పంచాయతీ ఈఓకి ఫోన్లు చేయించినట్లు సమాచారం. రెవెన్యూ అధికారులు, పంచాయతీ సిబ్బంది తక్షణమే స్పందించి ఆక్రమణలు అడ్డుకోవాలని భవానీ పురం వాసులు కోరుతున్నారు.

మూగబాలికపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన బాలిక

సరుబుజ్జిలి: మూగబాలికపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఫకీర్‌సాహెబ్‌పేట గ్రామానికి చెందిన బలగ ఇందు అనే 8వ తరగతి చదువుతున్న బాలిక ఆరు బయట ఉండగా.. కుక్కలు దాడి చేయడంతో శనివారం గాయపడింది. వెంటనే బాలికను జొన్నవలస ఏరియా ఆస్పత్రికి తరలించారు. మొత్తం 12 చోట్ల గాయాలైనట్లు తండ్రి జగదీష్ తెలిపారు.